క్లుప్తంగా

రీ-సర్వేతో రైతులకు మేలు



మాట్లాడుతున్న రీ-సర్వే డీటీ పడాల్

మునగపాక: ప్రతి రైతు రీ-సర్వేను సద్వినియోగం చేసుకోవాలని రీ-సర్వే డీటీ పడాల్ కోరారు. మండలంలోని మెలిపాక సచివాలయంలో మంగళవారం రీ-సర్వేకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన రీ-సర్వేలో లోపాలను సవరించడంతోపాటు రైతుల రికార్డులను పరిశీలిస్తామన్నారు. ప్రతి రైతు అందుబాటులో ఉండాలన్నారు. రీ-సర్వే ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. సర్పంచ్ అయినంపూడి విజయభాస్కరరాజు, డీటీ శేషుబాబు, వీఆర్వో అశోక్, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, గుంట్ల అప్పారావు, యాదగిరి గణేష్ పాల్గొన్నారు.

శ్రీరాంపురంలో చలివేంద్రం ఏర్పాటు



గ్రామ సచివాలయం వద్ద చలివేంద్రం

పాయకరావుపేట: మండలంలో శ్రీరాంపురం గ్రామ సచివాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు గ్రామ కార్యదర్శి వై.వి. సత్యనారాయణ తెలిపారు. వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చడం కోసం, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న హోంమంత్రి అనిత

పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల పూర్వ ట్రెజరర్ దివంగత కె.రామకృష్ణరావు జ్ఞాపకార్థంగా శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు అరట్లకోట గ్రామంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.15 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీన్ని హోం మంత్రి వంగలపూడి అనిత మంగళవారం ప్రారంభించారు. విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.వి.కె. విజయ్ ప్రకాష్, పెదిరెడ్డి చిట్టిబాబు, గెడ్డం బుజ్జి, తోట నగేష్, సర్పంచ్ అప్పలనర్స, కట్టా శ్రీను, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారీ వాహనాల అడ్డగింత

మునగపాక: మునగపాక జంక్షన్ సమీపంలో పూడిమడక రోడ్డులో అధిక లోడుతో వెళ్తున్న రెండు భారీ వాహనాలను స్థానికులు అడ్డుకున్నారు. కొంత కాలంగా పూడిమడక రోడ్డులో భారీ వాహనాల రాకపోకల వల్ల ప్రమాదాలు చోటు చేసుకోవడంతో స్థానికులు అధికారుల వినతి అందించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ కొంతమంది లారీ డ్రైవర్లు అధిక లోడుతో బండ రాళ్లను తరలించుకుపోతున్న లారీలను గమనించి మంగళవారం రాత్రి వాటిని పట్టుకున్నారు. అనుమతులు లేకుండా భారీ వాహనాలను ఎలా తిప్పుతారంటూ డ్రైవర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత సమాచారాన్ని మునగపాక పోలీసులకు వివరించారు. బుధవారం సంబంధిత వాహనాలను బరువు తూయించి కేసు నమోదుతో పాటు జరిమానా విధిస్తామని ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

జేవీపాలెంలో అక్రమంగా గ్రావెల్ తరలింపు



గ్రావెల్ తరలించిన ప్రాంతం

ఎస్.రాయవరం: జేవీపాలెం గ్రామంలో గ్రావెల్ అక్రమ దందా జోరుగా కొనసాగుతోంది. కూటమి నేతలు అండదండలతో రాత్రిళ్లు అక్రమంగా గ్రావెల్ తరలించుకుపోయి సొమ్ము చేసుకుంటున్నారు. జిరాయితీ స్థలంలో సైతం మట్టి తీసుకుని చదును చేసుకోవాలంటే రెవెన్యూ అధికారుల అనుమతులు తీసుకోవాలి. ఇక్కడ ఎటువంటి అనుమతులు లేకుండా దర్జాగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అక్రమ గ్రావెల్ తవ్వకాలకు చెక్ పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆరోగ్యానికి వేసవి నేస్తాలు..





జల్లూరు మెయిన్‌రోడ్డులో కొబ్బరి బొండాల విక్రయాలు

కోటవురట్ల విక్రయాలకు పుచ్చకాయలు

- ప్రయాణికుల తాపానికి శీతల పానీయాలు
- రోడ్ల పక్కన జోరుగా కొబ్బరిబొండాల విక్రయాలు
- అదే బాటలో పుచ్చకాయలు
- జ్యూస్ సెంటర్లలో పెరిగిన అమ్మకాలు

కోటవురట్ల: భానుడి ప్రతాపంతో భగభగ మండిపోతున్న ఎండలు.. మే నెల రాకుండానే 40 డిగ్రీల ఉష్ణోగ్రతల హీట్.. బయటకు కాలు పెట్టాలంటేనే హడలెత్తిపోతున్న వేళ.. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బతో అస్వస్థతకు గురికావడం తథ్యం. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరి దృష్టి వేసవి నేస్తాలపైనే పడుతోంది. దాంతో వేసవి నేస్తాలకు గిరాకీ పెరిగి విక్రయాలు హాట్‌హాట్‌గా జరుగుతున్నాయి. బతికుంటే బలిసాకు తినొచ్చు అన్న చందంగా రహదారుల్లో ప్రయాణికులు ఎక్కడికక్కడ ఆగి చల్లదనాన్ని ఇచ్చే కొబ్బరి బొండాలు, పుచ్చకాయలు, చెరకు రసాలు, శీతల పానీయాలను ఓ పట్టు పడుతున్నారు. ఎండలు పెరగడంతో వీటి ధరలు కూడా పెరిగాయి. పల్లెల్లో మామూలు రోజుల్లో కొబ్బరి బొండాం రూ.15కే దొరకగా, ప్రస్తుతం భానుడి దెబ్బకు రూ.30 నుంచి రూ.40 వరకు పెరిగాయి. పట్టణాలలో అయితే రూ.50 వరకు విక్రయిస్తున్నారు. లీటరు బాటిల్‌లో కొబ్బరి నీళ్ల రూ.100కు విక్రయిస్తున్నారు. ఇక పుచ్చకాయల ధరలు కూడా భారీగానే పెరిగాయి. రహదారుల్లో పలు చోట్ల వీటి విక్రయాలు చేస్తున్నారు. ప్రస్తుతం పుచ్చకాయ కిలో రూ.25 వరకు పలుకుతోంది. గతంలో ఓ మోస్తరు కాయ రూ.30 నుంచి రూ.40కు దొరకగా, ప్రస్తుతం సిండికేట్‌గా మారి కిలో లెక్కన విక్రయాలు చేస్తున్నారు. ఆ విధంగా చిన్న కాయ రూ.60 వరకు పలుకుతోంది. ఓ మోస్తరు కాయ రూ.75 ఉంటోంది.

శీతల పానీయాలకు డిమాండ్..

ఎండలు పెరగడంతో శీతల పానీయాలకు డిమాండ్ పెరిగింది. మొన్నటి వరకు మూతపడిన జ్యూస్ సెంటర్లు మళ్లీ తెరుచుకున్నాయి. ఖర్బూజ, సపోటా, దానిమ్మ, అరటి, ద్రాక్ష జ్యూస్‌లు, మిల్క్ షేక్, ఫ్రూట్ సలాడ్, ఐస్‌క్రీమ్స్‌కు మంచి డిమాండ్ వచ్చింది. ఎక్కడికక్కడ జ్యూస్ సెంటర్లు పెరిగాయి. నిమ్మసోడా, క్రస్, లస్సీ, ఆర్గానిక్ చెరకు రసం సెంటర్లకు డిమాండ్ వచ్చింది. ప్రధాన రహదారుల్లో ఎక్కడికక్కడ స్టాళ్లు పెట్టి విక్రయాలు చేస్తున్నారు. కొబ్బరి బొండాలు చెట్ల కింద వేలాడదీసి జోరుగా విక్రయిస్తున్నారు. పుచ్చకాయలను గుట్టలుగా పోసి అమ్ముతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

ఎండల తీవ్రత పెరగడంతో తగు జాగ్రత్తలు తప్పనిసరని వాతావరణవేత్తలు, వైద్యులు సూచిస్తున్నారు. ఎండలో తిరగొద్దని, అత్యవసరమైతే తగు వస్త్రాలు ధరించి తలకు టోపీ పెట్టుకుని ప్రయాణించాలని చెబుతున్నారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్త పడాలని హెచ్చరిస్తున్నారు. చలువ చేసే కొబ్బరినీళ్లు, పుచ్చకాయ, బార్లీ, చియా సీడ్స్, సబ్జా వంటివి తీసుకోవాలని సూచిస్తున్నారు. సాధ్యమైనంత వరకు దూరపు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని తప్పని పరిస్థితుల్లో తెల్లవారుజామున, రాత్రి వేళల్లో జాగ్రత్తలు తీసుకుంటూ ప్రయాణించాలని చెబుతున్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్త పడాలి..



ఎండల తీవ్రతతో వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. ఎండల్లో తిరగకుండా ఉంటే మంచిది. తప్పని పరిస్థితులైతే తెల్లటి కాటన్ దుస్తులు, టోపీ ధరించాలి. ఎక్కువగా మంచినీళ్లు తాగాలి, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ తాగుతూ ఉండాలి. జ్వరం వచ్చి వడదెబ్బ తగిలినట్టు అనిపిస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలి.

– డాక్టరు ప్రసాద్, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, కోటవురట్ల

కొబ్బరి బొండాలకు గిరాకీ



ఎండలు పెరిగాయి. ఈ నేపథ్యంలో కొబ్బరి బొండాలకు, శీతల పానీయాలు, పుచ్చకాయలకు డిమాండ్ ఏర్పడింది. బయట తిరగాలంటేనే భయమేస్తోంది. ఉష్ణోగ్రతలు బాగా పెరిగాయి. తప్పని పరిస్థితుల్లో కాటన్ దుస్తులు ధరించి వెళుతున్నాం. రహదారుల్లో కొబ్బరి నీళ్లు, శీతల పానీయాలు తీసుకుంటున్నాం.

– చామంతుల శ్రీనివాస్, కైలాసపట్నం

జవహర్ నవోదయకు విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈవోలు రామారావు, శ్రీజోష్, అధ్యాపకులు

కోటవురట్ల: విద్యార్థులు చిన్నతనం నుంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదవాలని ఎంఈవోలు రామారావు, శ్రీజోష్ ఆకాంక్షించారు. సుంకపూరు ఎంపీపీ స్కూల్‌కు చెందిన విద్యార్థి పి.కౌశిక్ జవహర్ నవోదయలో ప్రవేశానికి అర్హత సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థి కౌశిక్‌ను అధ్యాపక బృందం మంగళవారం అభినందించింది. విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



ఉపాధి పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో ఉపాధి హామీ పనులను ఏపీవో శివ, కూటమి నేతలు మళ్ల వరహా నరసింగరావు, మళ్ల రాజేష్, కొయిలాడ దశావతారం మంగళవారం ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం ద్వారా కాలువలు, చెరువుల అభివృద్ధి చేస్తామని ఏపీవో తెలిపారు. అర్హులైన వారికి జాబ్ కార్డులు అందజేస్తామన్నారు. దీనికి తోడు కూలీలకు ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో కూలీలు పాల్గొన్నారు.

వైభవంగా భద్రావతి, భావనారుషి కల్యాణ మహోత్సవం



ఉత్తరాంధ్ర జిల్లా పద్మశాలీలు, చేనేత పెద్దలు

అచ్యుతాపురం రూరల్: నేతన్నల ఆరాధ్య దైవమైన భద్రావతి సమేత భావనారుషి కల్యాణ మహోత్సవం దుప్పితూరులో ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మాడెం సూరి అప్పారావు, సభ్యులు ఆధ్వర్యంలో మండలంలో చేనేతలు, పద్మశాలీలు ఏకమై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కమిటీ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు రూ.10 వేల చొప్పున విరాళాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా, విద్యుత్ కాంతుల నడుమ స్వామివారిని పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల రాష్ట్ర చేనేత ప్రధాన కార్యదర్శి జి.వి.ఎం.సి. మాజీ కార్పొరేటర్ పప్పు రాజారావు, సింహాచలం దేవస్థానం బోర్డు డైరెక్టర్ సూరిశెట్టి సూరిబాబు, కొప్పల రమేష్, పొన్నగంటి అప్పారావు, కొప్పల రామ్ కుమార్, వాసపల్లి ఈశ్వర్రావు, ఉత్తరాంధ్ర జిల్లాల చేనేత పెద్దలు హాజరై భద్రావతి సమేత భావనారుషి కల్యాణ మహోత్సవం తిలకించారు.

మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి



కొడవటిపూడిలో ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులు

కోటవురట్ల: 'మీ పిల్లలకు మంచి విద్యనందిస్తాం.. వంద శాతం ఇంగ్లిషు మీడియంలో బోధిస్తాం.. మా బడిలో చేర్పించండి' అంటూ సర్కారు బడి గురువులు రోడ్డెక్కారు. పోటీ ప్రపంచంలో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య గణనీయంగా పడిపోతోంది. దాంతో ఉపాధ్యాయులకు తిప్పలు తప్పడం లేదు. ప్రైవేటు పాఠశాలల మాదిరి ఫ్లెక్సీలతో ప్రచారం చేయడంతో పాటు ఇంటింటికీ తిరిగి వేడుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొడవటిపూడి ఎంపీయూపీ స్కూల్‌లో వచ్చే విద్యా సంవత్సరంలో పిల్లల సంఖ్యను పెంచేందుకు హెచ్ఎం ఎం.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటి బాట పట్టారు. తొలుత సర్పంచ్ కోసూరి అప్పారావు, ఎంపీటీసీ యలమంచిలి ప్రకాష్‌ల సహకారంతో గ్రామ ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలోపు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలో లభిస్తున్న సదుపాయాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

పీఎం కిసాన్‌కు భూ ఆధార్ తప్పనిసరి



రైతు సేవా కేంద్రం సిబ్బంది సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రావు

అచ్యుతాపురం రూరల్: పీఎం కిసాన్‌కు భూ ఆధార్ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్ రావు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడారు. మండలంలో 9,792 మంది రైతులకుగాను ఇప్పటి వరకూ 4,789 మంది మాత్రమే పీఎం కిసాన్‌కు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకున్నారన్నారు. అనంతరం మండలంలో రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమీక్షించారు. నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే 20వ విడతగా మే నెలలో జమ చేస్తామన్నారు. మిగిలిన రైతులు వివరాలు తెలుసుకుని త్వరగా నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి బి.శంకర్ గోవింద్, వ్యవసాయ విస్తరణ అధికారి కె.బి.సూర్యనారాయణ, యలమంచిలి ఇన్‌చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు సి.సుమంత, గ్రామ వ్యవసాయ సహాయకులు రాజ్ కుమార్, నీరజ, నవ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై మంత్రి, కలెక్టర్ సమీక్ష



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న హోం మంత్రి అనిత, కలెక్టర్ విజయ్‌కృష్ణన్

నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని హోం మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ఆదేశించారు. మంగళవారం వారు నక్కపల్లిలో మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షించారు. ఉద్దండపురం వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన వాటర్ గ్రిడ్‌పై సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు చేసిన పనులు, ఇంకా చేపట్టాల్సినవి, అన్ని గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీశారు. వాటర్ గ్రిడ్ నుంచి మిగిలిన గ్రామాలకు పైపులైను ఏర్పాటు చేసేందుకు హైవే అధికారులు అనుమతి ఇవ్వడంతో పనులు వేగవంతం చేయాలన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గంలో 140 గ్రామాల ప్రజలకు తాగునీరు అందిస్తున్నట్టు హోంమంత్రి తెలిపారు. ఈ సమీక్షలో జిల్లా ప్రత్యేకాధికారి గిరీష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామస్వామి, ఆర్డీవో వి.వి. రమణ, నేషనల్ హైవే అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

5 నుంచి ఉచిత పాలిసెట్ శిక్షణ

మునగపాక: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 5వ తేదీ నుంచి ఉచిత పాలిసెట్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు ఎం.సత్యనారాయణమూర్తి, మాడెం జోగారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్, అనకాపల్లికి చెందిన షిర్డీ సాయి లా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఫోన్ నంబరు 8096214216ను సంప్రదించాలన్నారు.

అధ్వానంగా మోడల్ స్కూల్ రోడ్డు



రాళ్లు తేలిన పాటిపల్లి మోడల్ స్కూల్ రోడ్డు

మునగపాక: మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా దర్శనమిస్తోంది. రహదారి మొత్తం రాళ్లు తేలి గతుకులమయంగా మారింది. ఈ రహదారిపై నిత్యం ఆటోలు, సైకిళ్లపై రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే కాకరాపల్లి నుంచి మోడల్ స్కూల్‌కు వెళ్లేందుకు ప్రస్తుతం ఉన్న రహదారిపై రాళ్లు తేలిపోయి దారుణంగా ఉంది. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి పక్కారోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యలమంచిలి రూరల్: యలమంచిలి 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధి రాంబిల్లి 11 కేవీ ఫీడర్‌కు సంబంధించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ పనుల నిమిత్తం బుధవారం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. రాజశేఖర్ తెలిపారు. అవకాశం ఉన్నచోట ఉదయం 4 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా ఇస్తామని తెలిపారు. యలమంచిలి మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం, యలమంచిలి, యర్రవరం, కొత్తపాలెం గ్రామాల రైతులు గమనించాలన్నారు.

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో ఎస్.రాయవరం ఫీడర్‌కు సంబంధించి బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. వెంకటాపురం, సర్వసిద్ధి, సైతారుపేట గ్రామాల్లో ఆక్వా పరిశ్రమలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

విద్యుత్ వైర్లపై పడ్డ కొబ్బరి చెట్టు



విద్యుత్ వైర్లపై పడిన కొబ్బరి చెట్టు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. తిమ్మరాజుపేట దరి విశాఖ డెయిరీ బల్క్ సెంటర్ సమీపంలో విద్యుత్ వైర్లపై మంగళవారం రాత్రి కొబ్బరి చెట్టు పడిపోయింది. దీంతో వైరు తెగిపోయింది. దాంతో గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వేసవి కావడంతో పిల్లలు, పెద్దలు, వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. సంబంధిత అధికారులు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నారు.

సాయి మెరైన్ పరిశ్రమ వ్యర్థాలతో దుర్వాసన

గుడివాడ గ్రామస్తుల ఆందోళన



పరిశ్రమ సిబ్బందిని చుట్టుముట్టిన ఆందోళనకారులు



పరిశ్రమ ముందు నిరసన తెలుపుతున్న గుడివాడ గ్రామస్తులు

ఎస్.రాయవరం: గుడివాడ రెవెన్యూ పరిధిలో సాయిమెరైన్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ వ్యర్థాలతో దుర్వాసనతోపాటు, తాగునీరు కలుషితం అవుతుందని పరిశ్రమ ఎదుట గ్రామస్తులు మంగళవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నల్లపరాజు వెంకటరాజు, ప్రస్తుత సర్పంచ్ దూళి శ్రీనుబాబు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పంచాయతీ అనుమతులు లేకుండా ఏర్పాటైన పరిశ్రమ నుంచి వ్యర్థ జలాలు నేరుగా పంట కాలువ (వరహానది పాయ)లో వదిలేస్తున్నారని తెలిపారు. ఈ కాలువ నీరు పూర్తిగా కలుషితమై సమీప చెరువులు నేలబావులు, భూగర్భ జలాలు సైతం రంగుమారి దుర్గంధం వెలువడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్గంధంతో దోమల సమస్య పెరిగిందని వాపోయారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. పొరుగు గ్రామాలైన రేవుపోలవరం, కొత్త రేవుపోలవరం గ్రామస్తులు నిరసన తెలిపారు. హోంమంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. ఇకనైనా వ్యర్థ జలాలు నివారించకుంటే పరిశ్రమ కార్యకలాపాలకు అడ్డుపడతామని హెచ్చరించారు. ఈ క్రమంలో పరిశ్రమ ఎండీతో ఫోనో మాట్లాడగా గురు, శుక్రవారాల్లో నివారణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారన్నారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు. గ్రామస్తుల ధర్నాకు వైఎస్సార్ సీపీ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు మామిడి చంటి, జోగుబాబు, వర్మ, దళిత హక్కుల పోరాట సమితి నాయకుడు పిల్లి వీర్రాజు, ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి వీఎస్ రాహుల్, స్థానికులు సీహెచ్ రాజు, కొవ్వూరి సురేష్ పాల్గొన్నారు.



రంగుమారిన కాలువనీరు

వరి కోతలు వాయిదా వేసుకోవాలి



మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: వర్ష సూచన ఉన్నందున్న కోత దశలో ఉన్న వరి పైరు కోయడం వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే కోసి ఉంటే పనలను కుప్పలుగా వేసుకుని టార్పాలిన్ కప్పి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు సూచించారు. మంగళవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టిపడే దశలో ఉన్న వరి చేలుకు 5 సెం.మీ. లోతు వరకూ నీరు ఉండేలా చూసుకోవాలన్నారు. నవ్వులలో కాయ తొలుచు పురుగు నివారణకు క్లోరిఫైరిఫోస్ 2.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వాతావరణ పరిస్థితులకు వేరు, కాండం కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మాంకోజెబ్‌ను లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కలిపి మొక్కల మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. నువ్వు, వేరుశనగ పైరులను కోయడం వాయిదా వేసుకోవాలని కోరారు. పోషక విలువలున్న చెరకు చెత్తను చెరకు పొలంలో పరచుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెరకులో ఎర్రనల్లి ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. నివారణకు కరిగే గంధకం లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున లేదా డైమిథోయేట్ 2. మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. టమోటా పంటలో పూత, పిందె రాలడం గమనించవచ్చని, నివారణకు 1 మి.లీ ప్లానోఫిక్స్ మందును 4.5 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మామిడి తోటల్లో పిందె రాలడం నివారణకు 1 మి.లీ ప్లానోఫిక్స్ మందును 4.5 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయవచ్చన్నారు. రాగల వర్షాన్ని వినియోగించుకుని ఖాళీ పొలాల్లో వేసవి లోతు దుక్కులు దున్నుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు టి.శ్రీలత, కె.వి.రమణమూర్తి, బి.భవాని, వి.చంద్రశేఖర్, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి పాల్గొన్నారు.